ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

దామరచర్ల, జూన్ 19: మండల కేంద్రాల్లో ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనికి చేశారు. దవాఖానలో ఓపీ రిజిస్టర్, మందుల స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సీరియస్ కేసులను జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించాలన్నారు. అనంతరం భవిత కేంద్రాన్ని, కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లను పరిశీలించారు. నూతన సాంకేతక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని విద్యార్థులకు కృత్యాధార పద్ధతిలో బోధించాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో బాలికలతో ముఖాముఖి నిర్వహించారు. పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లను, పారిశుద్ధ్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, మండల ప్రత్యేకాధికారి పత్యేనాయక్, డీఈవో భిక్షపతి తదితరులున్నారు.

దామరచర్లలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పాఠశాలల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

నల్లగొండ,జూన్ 19 : పాఠశాలల్లో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం పలు శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలు, హాస్టల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. పాఠశాలల ఆవరణల్లో పిచ్చి మొక్కలు, నీరు నిల్వ ఉంటే తొలగించాలన్నారు. మురుగు కాల్వలను శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, గడ్డి, చెత్తాచెదారాన్ని తొలగించాలని డీపీవో వెంకయ్యను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షాలతో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు పాములు, తేలు కాట్లకు గురైతే పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఏఎమ్మెఎస్‌వోలకు షోకాజ్‌లు ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలల్లో అధికారులు బస చేసి అక్కడ పరిస్థితులు తెలుసుకొని పరిష్కరించాలన్నారు. విద్యార్థులు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అమిత్ నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

23న ఉపాధ్యాయులకు టెలీకాన్ఫరెన్స్

రామగిరి, జూన్ 19: ఈ నెల 23న జిల్లా వ్యాప్తంగా 6 నుంచి 12 తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయులకు, హెచ్‌ఎంలకు టెలీకాన్ఫరెన్స్ ఉంటుందని డీఈవో భిక్షపతి తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టిశాషాట్ నిపుణ చానెల్‌లో కార్యక్రమం ఉంటుందన్నారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతిని, 9848578845లో సంప్రదించాలని కోరారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

శాలిగౌరారం, జూన్ 19 : మండలంలోని బైరవునిబండ గ్రామానికి చెందిన దండ సోమిరెడ్డి అనారోగ్యం బారిన పడడంతో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.లక్ష చెక్కును గురువారం మాజీ సర్పంచ్ దండ రేణుకా అశోక్‌రెడ్డి బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో పడాల శంకర్, శ్యామ్, వెంకట్‌రెడ్డి, జయమ్మ, పూలమ్మ, సరోజనమ్మ ఉన్నారు.

ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి

తిప్పర్తి, జూన్ 19 : దున్నుతుండగా ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తిప్పలమ్మగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... ఆ గ్రామానికి చెందిన దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి (51) గురువారం తన పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నుతుండగా అది తిరగబడింది. ట్రాక్టర్ సీట్లో ఉన్న వెంకట్‌రెడ్డి నాగళ్ల మధ్య ఇరుక్కపోయి బలమైన గాయాలైన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య దేవిరెడ్డి సరిత ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రామ్మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కొడుకు, కూతురు ఉన్నారు.

రైతుబంధు అంటే గుర్తొచ్చేది కేసీఆర్

కట్టంగూర్, జూన్ 19 : రైతుబంధు అంటే మొట్టమొదట గుర్తొచ్చేది మాజీ సీఎం కేసీఆర్ అని బీఆర్‌ఎస్ మండల నాయకుడు పెద్ది బాలనర్సయ్యగౌడ్ అన్నారు. గురువారం కట్టంగూర్‌లో ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మేనిఫెస్టోలో పెట్టకుండా రైతు బంధు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు హామీలతో ప్రజలను మోసం చేసిందన్నారు. గ్రామాలకు నిధులు కేటాయింపులో రేవంత్‌రెడ్డి సర్కార్ నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పాలనా వైఫల్యాలు, ఇచ్చిన హామీలను ప్రజల దృష్టిని మళ్లించేందుకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులు పెట్టడంలో కుట్రకోణం దాగి ఉందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. అది గ్రహించిన రేవంత్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు.

మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మిర్యాలగూడ, జూన్ 19 : పట్టణంలోని వాసవీనగర్‌కు చెందిన సాంబశివ రైస్ ఇండస్ట్రీస్ ఎండీ రంగా లింగయ్య అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు లింగయ్య మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. యడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, పాలారపు సత్యనారాయణ, రంగా రంజిత్, రెడబోతు సంతోష్‌రెడ్డి, మాలావత్ రవీందర్ నాయక్, గంటా సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హన్మంతు పెద్దమ్మ మృతి బాధాకరం

చందంపేట(దేవరకొండ), జూన్ 19 : దేవరకొండ పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ దివంగత హన్మంతు చంద్రన్న భార్య హన్మంత్ పెద్దమ్మ మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలో పెద్దమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

కొండమల్లేపల్లి, జూన్ 19 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అభిస్తుందని ఎంఈవో నాగేశ్వరరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి ఐఐటీ భువనేశ్వర్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్‌లో సీటు సాధించిన విద్యార్థి ఇంద్రవత్ చందర్‌ను సన్మానించారు. ఉపాధ్యాయులు జనార్ధన్‌రెడ్డి, కట్టబొయిన శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌చారి, సైదానాయక సరస్వతి, శ్రీదేవి పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

నల్లగొండ, జూన్ 19 : ప్రతి మహిళ స్వశక్తితో ఎదిగి స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని బీఆర్‌ఎస్ మాజీ కౌన్సిలర్ మారగోని గణేష్ పిలుపునిచ్చారు. యువ పరివర్తన ఫౌండేషన్ సహకారంతో పట్టణంలోని చైతన్య పురికాలనీలో గురువారం ఉచిత టైలరింగ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు చైతన్యవంతంగా ఉన్నప్పుడే కుటుంబం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఫౌండేషన్ మేనేజర్ మునేశ్, కావ్య, విజయశ్రీ, రాణి పాల్గొన్నారు.

దాతలు పీహెచ్‌సీకి పరికరాలు అందించాలి

వీల్‌చైర్ అందిస్తున్న దాత శ్రీనివాస్

త్రిపురారం, జూన్ 19: దాతలు ముందుకొచ్చి పీహెచ్‌సీలో రోగులకు పరికరాలు అందించాలని పీహెచ్‌సీ వైద్యుడు మాలోతు సంజయ్ అన్నారు. గురువారం మండలంలోని చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన అందె శ్రీనివాస్ తండ్రి సత్యమయ్య జ్ఞాపకార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ.30 వేల విలువగల అడ్జెస్ట్‌మెంట్ బెడ్, ఎయిర్ పరుపు, టు ఇన్ వన్ వీల్‌చైర్ అందించినట్లు తెలిపారు. ఆరోగ్య కేంద్రానికి వాటర్ ఫిల్టర్ అవసరముందన్నారు. దాత అందె శ్రీనివాస్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మాతంగి వెంకయ్య, సూపర్‌వైజర్లు కమలమ్మ, పుట్ట గోపాల్‌రెడ్డి, హెడ్‌నర్స్ హైమావతి, ల్యాబ్ టెక్నీషియన్ నళినికాంత్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా టిఎస్ ఈసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

రామగిరి, జూన్ 19: ఇంజినీరింగ్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన టీఎస్ ఈసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ముగిసింది. ఈ నెల 17న ప్రారంభమైన ప్రక్రియలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈసెట్-2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు స్లాట్ బుకింగ్ ప్రకారం హాజరై తమ సర్టిఫికెట్స్ పరిశీలన చేసుకుని కళాశాలల ఎంపిక కోసం వెబ్ ఆప్షన్స్‌కు అర్హత సాధించారు. తొలిరోజు 122 మంది, రెండో రోజు 192 మంది, చివరి రోజు 185 మందితో కలిపి 499 మంది హాజరైనట్లు కౌన్సెలింగ్ కేంద్రం కన్వీనర్, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహారావు వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విలువతో కూడిన రాజకీయాలు చేద్దాం

ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు, జూన్ 19 : విలువతో కూడిన రాజకీయం చేయాలని నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం క్యాంపు కార్యాలయంలో నాంపల్లి మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. అందరూ ఏకమై నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. అంతకుముందుకు మార్నింగ్ వాక్‌లో పలివెల గ్రామంలో పర్యటించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, ఇండ్లపై విద్యుత్ తీగలు, రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లు, వివిధ గ్రామాలకు వెళ్లే లింకు రోడ్లను పరిశీలించారు. ప్రభుత్వ టీచర్లతో మాట్లాడుతూ సాజిక బాధ్యతతో పేద విద్యార్థులకు ఎంత కొంత చేయాలన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి పార్టీలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లు ఇప్పిస్తానని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

మాట్లాడుతున్న డీఈవో భిక్షపతి

మిర్యాలగూడ, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. గురువారం ఆయన పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో 1,438 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని, ఇందులో 229 జడ్పీ హైస్కూల్స్, 117 యుపీఎస్, 1,100కపైగా ప్రైమరీ స్కూల్స్, కేజీబీవీ 27, మోడల్ స్కూల్స్ 17, యుఆర్ఎస్ ఒకటి ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు 69 వేల మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారన్నారు. ఆగస్టు 31తో అడ్మిషన్ గడువు ముగుస్తుందన్నారు. అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలలను నడపొద్దన్నారు. విద్యార్థులు లేని 24 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించామని, వాటిని మూసివేస్తామని, ప్రస్తుత విద్యా సంవత్సరంలో పది పాఠశాలలను పునః ప్రారంభించామని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో బాలునాయక్ ఉన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలి

నిరసనలో పాల్గొన్న సీపీఎం నేతలు

రామగిరి, జూన్ 19: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను ఆపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. ఆ దాడులను ఖండిస్తూ గురువారం నల్లగొండ బస్టాండ్ సమీపంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్ దాడులతో అతలాకుతల మవుతున్న పాలస్తీనాకు సీపీఎం సంఘీభావం తెలిపింది. ఇజ్రాయిల్‌పై దాడుల విషయంలో మోడీ ప్రభుత్వం మౌనం వీడాలన్నారు. బాధిత పాలస్తీనాపై మానవీయతను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నుంచి ఇజ్రాయిల్‌కు డ్రోన్ల సరఫరాను భారత్ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు నారీ ఐలయ్య, చిన్నపాక లక్ష్మీనారాయణ, దండెంపల్లి సత్తయ్య, నర్సిరెడ్డి, ఖమ్మంపాటి శంకర్, బోల్లు రవీందర్, కోట్ల అశోక్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యం ఉచితంగా అందించాలి

మాట్లాడుతున్న నాగార్జున

కట్టంగూర్, జూన్ 19 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా సంక్షేమ పథకాలు మారుతున్నాయే తప్పా పేదల బతుకుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదన్నారు. నిధుల కొరత కారణంగా పథకాలు ముందుకు సాగడం లేదన్నారు. గిరిజన, దళితుల కార్పొరేషన్లను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. కుల వివక్ష, అంటరానితనం, ప్రభుత్వ విధానాల స్థితిగతులపై ఈ నెల 22న కట్టంగూర్‌లో రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంటెపాక కృష్ణ, మండల కార్యదర్శి చిలుముల రామస్వామి, సీఐటీయూ జిల్లా నాయకులు పెంజర్ల సైదులు, రాజేశ్, సైదులు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ముప్పారంలో రెవెన్యూ సదస్సు

నిడమనూరు, జూన్ 19 : దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడమే భూ భారతి చట్టం లక్ష్యమని నిడమనూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య అన్నారు. మండలంలోని ముప్పారం గ్రామ రైతువేదికలో గురువారం భూ భారతి రెవెన్యూ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. సోమోరి గూడెం, ముప్పారం, గుంటుక గూడెం, గౌండ్ల గూడెం గ్రామాల ప్రజలు అందజేసిన దరఖాస్తులను స్వీకరించి రశీదులు అందజేశారు. కార్యక్రమంలో గిర్దావర్లు సందీప్, దాడి రాజిరెడ్డి, నాయకులు ముంగి శివమారయ్య, కొండా శ్రీనివాస్‌రెడ్డి, ఆలంపల్లి మైసయ్య, కోట్ల సైదులు, మేరెడ్డి వెంకటరమణ, చరక శ్రీను, ఆలంపల్లి ప్రసాద్, నర్సింహ, గంగాధర్, మల్లప్ప, పాపయ్య, శ్రీను తదితరులున్నారు.

జాతీయస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలకు శివాని, బన్నీ ఎంపిక

నకిరేకల్, జూన్ 19 : నకిరేకల్ సోషల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల విద్యార్థిని కందికంటి శివాని, మంగళపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి పూర్తి చేసుకున్న దోరెపల్లి బన్నీ జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కర్ర వీరారెడ్డి, పీఈటీ చైతన్యకుమార్ గురువారం తెలిపారు. ఈ నెల 4 నుంచి 6 వరకూ మంగళపల్లిలో జరిగిన 47వ తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో నల్లగొండ జిల్లా జట్టు తరపున వీరు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకూ బీహార్ రాష్ట్రంలోని నవాడలో జరుగుతున్న 47వ జాతీయ స్థాయి జూనియర్ హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్‌లో శివాని పాల్గొన్నట్లు తెలిపారు.

విద్యార్థులు ఇష్టంతో చదవాలి

నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎంఈవో

కట్టంగూర్, జూన్ 19 : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని ఎంఈవో అంబటి అంజయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వసతి గృహాల్లో నాణ్యమై భోజనంతో పాటు సదుపాయాలు కల్పిస్తోందన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో వసతిగృహ సంక్షేమ అధికారి గుజ్జుల శంకర్‌రెడ్డి, సిబ్బంది వెంకట్‌రెడ్డి, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎంఈవో

తిరుమలగిరి(సాగర్), జూన్ 19: నాణ్యమైన విద్య కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందని ఎంఈవో శ్రీనివాస్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని శ్రీరాంపురం ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాత గార్లపాటి వెంకటేశ్వర్లు సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్, బోధన సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ నాగమణి, హెచ్‌ఎం ఫరీద్, ఉపాధ్యాయులు మల్లీశ్వరి, తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, ఏలియా, చంద్రయ్య, గ్రామస్తులు శివారెడ్డి, ప్రశాంత్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మూలమలుపులు

సత్యనారాయపురం వద్ద ప్రమాదకరంగా ఉన్న మలుపు

కట్టంగూర్, జూన్ 19: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. ఈ మలుపుల వద్ద ఎలాంటి ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కట్టంగూర్ నుంచి ఈదులూరు, కురుమర్తి, పరడ, బొల్లెపల్లి, దుగినవెల్లి గ్రామాలకెళ్లే రహదారులపై అనేక మలుపులున్నాయి. ఈ మూలమలుపుల వద్ద ప్రమాదాలు జరిగి పరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మూల మలుపుల వద్ద కంప చెట్ల తొలగించి.. హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

అంగన్వాడీలను బలోపేతం చేయాలి

మిర్యాలగూడటౌన్, జూన్ 19: అంగన్వాడీలను బలోపేతం చేయాలని మిర్యాలగూడ ప్రాజెక్ట్ ఆఫీసర్ రేఖల మమత అన్నారు. మిర్యాలగూడ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలో ఈ నెల 12 నుంచి 17 వరకు సుమారు 812 మంది పిల్లలు అంగన్వాడీల్లో చేరినట్లు తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అంగన్వాడీల్లో మూడేళ్లు పూర్తి చేసుకున్న బాలికలు 568, బాలురు 653 మంది, నాలుగేళ్లు పూర్తయిన బాలికలు 522 మంది, బాలురు 528 మంది అంగన్వాడీల్లో కొనసాగుతున్నారని తెలిపారు. అంగన్వాడీ బాట ముగిసినా పిల్లల నమోదు ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

ఉపాధి పనులు పారదర్శకంగా చేపట్టాలి

పనులను పరిశీలిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి జూన్ 19: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు పారదర్శకంగా చేపట్టాలని కేంద్ర జల సంఘం అధికారి ఆనంద్ బాబు పేర్కొన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏపీ లింగోటం గ్రామంలో పామ్ ల్యాండ్‌ను, ఏడవల్లిలో ఇంకుడుగుంతలను, బివెల్లెంల, చిన్ననారాయణ పురం గ్రామాల్లో కందకాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో, ఎంపీడీవో ఉమేశ్, యాదయ్య, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి, జూన్ 19 : ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎదుళ్ల ఎల్లయ్య ఆధ్వర్యంలో గురువారం కొండమల్లేపల్లి పట్టణ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా వస్కుల ఇద్దయ్యమాదిగ, ప్రధాన కార్యదర్శిగా అందుగుల జానయ్య మాదిగ, ఉపాధ్యక్షుడిగా వస్కుల బాలకృష్ణ మాదిగ, సహాయ కార్యదర్శిగా ఎలిమినేటి అజయ్ మాదిగ, కోశాధికారిగా వస్కుల సైదులు మాదిగ, గౌరవ సలహాదారుడిగా అందుగుల శ్రీను మాదిగను ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పోలేని యాదయ్య మాట్లాడుతూ ఎమ్మార్పీస్ ఆవిర్భావ దినోత్సవాన్ని గ్రామాల్లో జెండా ఆవిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిన్నఅడిశర్లపల్లి మాజీ సర్పంచ్ గడ్డం శ్రీరాములు మాదిగ, బక్కలయ్య మాదిగ, లింగయ్య మాదిగ, వెంకటేశ్ మాదిగ, శ్రీను మాదిగ పాల్గొన్నారు.

బీఏఎస్ పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

ఏవో మోతీలాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘాల నేతలు

నల్లగొండ, జూన్ 19: బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని కేవీపీఎస్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, టీజీఎస్ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆయా సంఘాల ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఏవో మోతీలాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేండ్లుగా జిల్లాలో బీఏఎస్ బిల్లులు ఇవ్వకపోవటంతో విద్యార్థులకు బోధించలేమని పలు ప్రైవేటు పాఠశాలలు పేర్కొంటున్నాయని తెలిపారు. నిధులు విడుదల చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆయా సంఘాల నేతలు పాలడుగు నాగార్జున, ఖమ్మం పాటి శంకర్, మల్లం మహేశ్, కొండేటి శ్రీను, ఆకారపు నరేశ్, గుండాల నరేశ్, బొల్లు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మిర్యాలగూడ, జూన్ 19: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ సీతారాంపురం ఫీడర్ కింద చెట్ల కొమ్మలను తొలగిస్తున్నందున మిర్యాలగూడ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11 కేవీ సీతారాంపురం ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, సీతారాంపురం, టాకారోడ్డు, గీతా మందిర్ రోడ్డు, వాసవీభవన్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో ఈ నెల 20న ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వన్‌టౌన్ ఏఈ మహేశ్ గురువారం తెలిపారు. విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

శాలిగౌరారం, జూన్ 19: కేసీఆర్ ప్రభుత్వం రైతుల మేలుకోరి నాట్లకు నాట్లకు మధ్య రైతుబంధు డబ్బులను రైతుల ఖాతాలో జమ చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఓట్లకు.. ఓట్లకు మధ్య రైతు భరోసా పేరుతో రైతులను మభ్యపెట్టేందుకు ప్రయత్నం చేస్తోందని శాలిగౌరారం మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వేమిరెడ్డి నర్సిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచే సత్తా లేక ఓట్ల కోసం రేవంత్ సర్కార్ కొత్త నాటకం ఆడుతోందని విమర్శించారు. ఎకరానికి రూ.15 వేల రైతు భరోసా ఇస్తామని చెప్పి రూ.12 వేలు ఇస్తున్నారని అన్నారు. దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు ఇస్తామని చెప్పి నేటికీ దాని ఊసెత్తడం లేదన్నారు.

పాఠశాలల బస్సులను తనిఖీ చేయండి

మిర్యాలగూడ, జూన్ 19: పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలల్లో బస్సులకు ఫిట్నెస్ తనిఖీలు నిర్వహించాలని కోరుతూ మిర్యాలగూడ ఆర్‌టీవోకు బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్ మాట్లాడుతూ మిర్యాలగూడలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో కాలం చెల్లిపోయిన బస్సులను వినియోగిస్తూ పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. స్కూల్ బస్సు ఫీజు పేరిట తల్లిదండ్రుల నుంచి వేలకువేల రూపాయలను వసూలు చేస్తూ ఫిట్నెస్ లేని బస్సులను వినియోగిస్తున్నారని అన్నారు. 60 సంవత్సరాలు పైబడిన వారిని డ్రైవర్లుగా కొనసాగించొద్దన్నారు. మద్యం తాగి బస్సులను నడిపే డ్రైవర్లపై, యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తాళ్లపల్లి సురేశ్, పరంగి సురేశ్, రవినాయక్, గాదగోని మహేశ్‌గౌడ్, లక్ష్మణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఎంపీడీవో ఆర్థిక సాయం

త్రిపురారం, జూన్ 19: మండలంలోని మాటూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఎంపీడీవో కునిరెడ్డి విజయకుమారి పిల్లల అభ్యున్నతికి ఆర్థిక సహాయం చేశారు. గురువారం ఆమె పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువ ఉండటాన్ని గుర్తించిన ఆమె టూటర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు రూ.10 వేలు అందజేశారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రమావత్ రవి, ప్రధానోపాధ్యాయుడు వాసు, పాండునాయక్, పండరి, ఉపాధ్యాయులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువకులు క్రీడల్లో రాణించాలి

కొండమల్లేపల్లి, జూన్ : యువకులు, విద్యార్థులు చదవుతో పాటు క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తనయుడు రమావత్ హేమంత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీలో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. ఫైనల్ పోటీల్లో దేవరకొండ సీవైసీ జట్టు, కొండమల్లేపల్లి ఆర్‌కే జట్టు తలపడగా దేవరకొండ టీమ్ గెలుపొందింది. ప్రథమ స్థానం సాధించిన సీవైసీ జట్టుకు రూ.50 వేలతో పాటు షీల్డ్, రన్నర్ జట్టుకు రూ.35 వేలతో పాటు షీల్డ్ అందజేశారు. క్రీడలతో స్నేహభావం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో పూరే ఆంజనేయులు, అరవింద్, ముత్తోజు జై శంకర్, హబీబ్, దాసరి రామకృష్ణ, గుండాల రమేశ్, భరత్‌కుమార్, ఎండీ లతీఫ్, రామ్‌లక్ష్మణ్, సయ్యద్ వసీం అక్రం, ఓం ప్రకాశ్, అరవింద్, అనిల్, పవన్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

పెద్దవూర, జూన్ 19: ఆయిల్‌పామ్ సాగు చేయడంతో అధిక లాభాలు గడించొచ్చని నాగార్జునసాగర్ డివిజన్ ఉద్యానవన అధికారి మురళి అన్నారు. గురువారం మండలంలోని తుంగతుర్తి గ్రామంలో కత్తి జయసింహారెడ్డి తోటలో జరిగిన ఆయిల్‌పామ్ మెగా ప్లాంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పతంజలి కంపెనీ జిల్లా మేనేజర్ మధుసూదన్‌రెడ్డి, సంపత్ కుమార్, వెంకన్న, శ్రీను తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం అందచేత

పెద్దవూర, జూన్ 19: మండలంలోని పులిచెర్ల గ్రామానికి చెందిన షేక్ సయ్యద్ పాషా ఇటీవల మృతి చెందాడు. చిన్ననాటి స్నేహితులు గురువారం పాషా నివాసానికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.51వేల ఆర్థిక సాయం చేశారు. మిత్రులు ఇరుమాది పాపిరెడ్డి, గోవింద్‌రెడ్డి, శివ, యాదయ్య, సైదులు, శ్రీను తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం వద్దు

నార్కట్‌పల్లి జూన్ 19: ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా రాజకీయ జోక్యం లేకుండా చూడాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. గురువారం సీపీఐఎం మండల కమిటీ సమావేశం చెరుకు పెద్దులు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఉదయ సముద్రం ప్రాజెక్టును పూర్తి చేసి చెరువులను నింపి రైతులకు సాగునీరు అందించాలన్నారు. కార్యక్రమంలో చింతపల్లి బయ్యన్న, దండు రవి, కట్ట రామచంద్రు, భగవంత్ రెడ్డి, కల్లూరి కంటమహేశ్వరం, బొల్లెద్దు సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

నిడమనూరు, జూన్ 19 : మండలంలోని జంగాలవారి గూడెం పాఠశాల విద్యార్థులకు ఎంఈవో లావూరి వెంకన్న దుస్తులు, టై, బెల్టులు గురువారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వ చేయూతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం రాములు, పాఠశాల హెచ్‌ఎం రవి, ఉపాధ్యాయులు ప్రతాప్, గణేశ్ తదితరులున్నారు.

శ్రీనివాస్‌రెడ్డి జీవితం ఆదర్శం

మిర్యాలగూడ, జూన్ 19: శ్రీనివాస్‌రెడ్డి జీవితం అందరికీ ఆదర్శణీయమని మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అవంతీపురం వృద్ధాశ్రమంలో కూన్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేశ్, కూన్‌రెడ్డి వెంకట్‌రెడ్డి, రాజ్యం, చిమట పద్మమదార్, సురేశ్, బసవయ్యగౌడ్, మల్లు గౌతంరెడ్డి, దేవిరెడ్డి మోహన్‌రెడ్డి, తిప్పన అనంతరెడ్డి పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు జరిమానా

నిడమనూరు, జూన్ 19 : వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు జరిమానా విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న తీర్పు చెప్పారు. కోర్టు లైజన్ అధికారి షేక్ అలీ అహ్మద్ కథనం ప్రకారం... ముకుందాపురం గ్రామానికి చెందిన రాం పిచ్చయ్య 2017 సంవత్సరం జనవరి 14 న తెల్లవారు జామున 55 గంటలకు టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా కన్నెకల్ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న ఖాళీ లారీని డ్రైవర్ అతివేగంగా నడిపి ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలైన పిచ్చయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మిర్యాలగూడ బంగారుగడ్డకు చెందిన లారీ డ్రైవర్ పోరెడ్డి వెంకట్‌రెడ్డి నిర్లక్ష్యం కారణంగానే తన మరిది పిచ్చయ్య మృతి చెందినట్లు వదిన రాం లింగమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్‌ఐ యాదయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. కేసును విచారించిన జడ్జి స్వప్న నిందితుడు వెంకట్‌రెడ్డిపై నేరం రుజువు కావడంతో రూ.5 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించనిపక్షంలో 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాధన వాదనలు వినిపించగా కోర్టు కానిస్టేబుల్ నవీన్ ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
పూర్తి వివరాలకు :
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం,
(గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.

నల్లగొండ: 9182777625, 9182777635		దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059	సూర్యాపేట: 9182777630	భువనగిరి: 9182777638
మిర్యాలగూడ: 9182777059	కోదాడ: 9182777630	చౌటుప్పల్: 9182777638